
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 26 ఆగస్టు 2025



వచ్చేనెల 13న లోక్ అదాలత్

శ్రీకాకుళం లీగల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): 'లోక్అదాలత్ వచ్చేనెల 13న నిర్వహించనున్నాం. లోక్అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేలా ప్రయత్నించాల'ని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా కోర్టు భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు న్యాయం చేకూర్చేలా పోలీసు అధికారులు కేసులను రాజీ చేయాలన్నారు. రాజీ వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతందని తెలిపారు. త్వరితగతిన కక్షిదారులకు న్యాయం చేసేలా ప్రయత్నించాలన్నారు.

మనుషులు చేసిన దేవుడు!

- వినాయక విగ్రహాల తయారీలో వారసులు
- మట్టి ప్రతిమలకు కేరాఫ్ మెళియాపుట్టి





మెళియాపుట్టిలో మట్టితో వినాయక విగ్రహాలు తయారు చేస్తున్న సవరయ్య

మెళియాపుట్టి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక విగ్రహాల తయారీకి మెళియాపుట్టి కేరాఫ్‌గా నిలుస్తోంది. ఈ గ్రామంలో బూరగాన రాములు, రేకాన దాలయ్య, వంజరాపు రమణ, వంజరాపు కృష్ణ ఇలా.. సుమారు పది కుమ్మరి కుటుంబాలు వినాయకుడు, దుర్గాదేవి విగ్రహాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాయి. పర్యావరణహితం కోరేలా.. మట్టితో ఆకర్షనీయంగా వినాయక విగ్రహాలు రూపొందిస్తున్నాయి. వినాయకచవితి వస్తే ఆ కుటుంబాలకు పండుగే. మట్టి ప్రతిమలకు డిమాండ్ ఉండడంతో చాలామంది విగ్రహాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. విగ్రహాలు ఆకర్షనీయంగా ఉండడంతో ఒడిశా రాష్ట్రం నుంచి కూడా కొంతమంది వచ్చి కొనుగోళ్లు చేస్తున్నారు. విగ్రహం సైజును బట్టి రూ.3వేల నుంచి రూ.10వేల వరకు విక్రయిస్తున్నారు. సాధారణ రోజుల్లో కులవృత్తి గిట్టుబాటుకాకపోయినా పండుగల సమయంలో తమకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఆ దేవుడే ఆదుకుంటున్నాడని ఆయా కుటుంబాలు పేర్కొంటున్నాయి.

మట్టి విగ్రహాల తయారీ కష్టమైనా.. దేవుడిపై ఇష్టంతో విగ్రహాలు తయారీ చేస్తున్నామని బూర గాన సవరయ్య తెలిపారు. కులవృత్తిని వదల కూడదనే ఉద్దేశంతో తన తండ్రి రాములు నేర్పిన విగ్రహాల తయారీ విద్యను కొనసాగిస్తున్నానని వెల్లడించారు.

మెళియాపుట్టి గ్రామానికి చెందిన బూరగాన రాములు గత 30 ఏళ్ల నుంచి మట్టిని నమ్ముకుని వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నారు. వినాయకచవితి, దసరా పండుల సమయాల్లో మట్టితో దేవుడి ప్రతిమలు చేసి విక్రయిస్తున్నారు. సాధారణ రోజుల్లో ప్రమిదలు, కుండలు తయారు చేసి.. వాటిని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. కొంతమంది గిట్టుబాటు కాక కులవృత్తిని వీడి వివిధ వ్యాపారాలు చేస్తున్నా.. రాములు మాత్రం కులవృత్తిని వదలలేదు. తన వారసులు సైతం మట్టి విగ్రహాల తయారీ కొనసాగిస్తున్నారు.

40 ఏళ్లుగా.. ఈ వృత్తిలోనే..

కాశీబుగ్గ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గలోని 11వవార్డు పూజారి వీధికి చెందిన రామ్‌కుమార్ పండా, బాబురామ్ పండా, సంతోష్ పండా 40 ఏళ్లుగా మట్టి వినాయక విగ్రహాల తయారీ సాగిస్తున్నారు. దేవుడి ప్రతిమలు చేయడమే తమ జీవనాధారమని వారు తెలిపారు. వినాయకచవితికి మూడు నెలల ముందు నుంచీ విగ్రహాల తయారీ ప్రారంభించామన్నారు. పర్యావరణానికి హాని కలుగకుండా వాటర్ రంగలు వేస్తామని తెలిపారు. ఏటా వినాయకచవితికి సుమారు 80 విగ్రహాలు విక్రయిస్తామన్నారు.



కాశీబుగ్గలో మట్టితో వినాయక విగ్రహాల తయారీ

నేడు బుజ్జాయి చేతిలో బొజ్జగణపయ్య



- 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల తయారీ
- 8,9,10 తరగతుల విద్యార్థులకు ఆహ్వానం
- ముఖ్యఅతిథిగా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని.. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'.. 'బుజ్జాయి చేతిలో బొజ్జగణపయ్య' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పర్యావరణహితంగా పండగ జరుపుకొనేలా.. విద్యార్థులను భాగస్వాములను చేసేలా మంగళవారం శ్రీకాకుళం నగరం అరసవల్లి రోడ్‌లో ఎల్.ఎన్ గ్రీన్స్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. విద్యార్థులకు శిక్షణ ఇచ్చి.. మట్టి వినాయక ప్రతిమలను తయారీ చేయించనుంది. ప్రతిమలకు అవసరమైన మట్టిని సమకూర్చనుంది. 8, 9, 10 తరగతుల విద్యార్థినీ, విద్యార్థులను ఆహ్వానిస్తోంది. విద్యార్థులు ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా పాల్గొనవచ్చు. తయారుచేసిన మట్టిప్రతిమలతోపాటు ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేయనుంది. ఈ కార్యక్రమానికి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు పేర్ల రిజిస్ట్రేషన్ కోసం 9985411066 నెంబర్‌కు సంప్రదించాలి. మంగళవారం ఉదయం 9.30గంటలకు ప్రాంగణానికి చేరుకోవాలి. ఖాళీ వాటర్ బాటిల్, చిన్నపాటి వస్త్రం వెంట తెచ్చుకోవాలి. ఈ కార్యక్రమానికి 'రవితేజ డెవలపర్స్' ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

త్వరితగతిన అర్జీలు పరిష్కరించండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్

6లో



జలుమూరు: చల్లవానిపేటపేటలో స్మార్ట్‌రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

7లో



మా మంచి ఉపాధ్యాయురాలు

- మూతపడిన పాఠశాలను తెరిపించారు

6లో



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మధుసూదనరావు

రోడ్డు ప్రమాదంలో యాచకురాలి మృతి

- ఘటనను చూసి తట్టుకోలేక మరో యాచకుడు కూడా..

8లో



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిన వర్షపునీరు.. మురుగునీరు

ముసురేసింది

- జిల్లాపై అల్పపీడన ప్రభావం
- ఏకధాటిగా వర్షం.. సిక్కోలు జలమయం
- నేడు కూడా ఇదేరీతిన కురిసే అవకాశం

శ్రీకాకుళం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ముసురు కమ్ముకుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా సోమవారం ఉదయం నుంచి చిరుజల్లుతో ప్రారంభమై.. మోస్తరుగా వర్షం కురుస్తూనే ఉంది. రాత్రి భారీగానే కురిసింది. రెండురోజులపాటు వర్షాలు భారీగా కురిసే అవకాశముందని.. జిల్లాప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ వాతావరణ శాఖ వెల్లడించింది. మంగళవారం కూడాను భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగరంలో ఎప్పటిలానే ఆర్టీసీ కాంప్లెక్స్, పలువార్డులు జలమయమయ్యాయి. ఖరీఫ్ సీజన్ కావడంతో.. వ్యవసాయ పనులను జోరు పెంచారు రైతులు. పలుచోట్ల పొలాల్లోకి వెళ్లిన వ్యవసాయ కూలీలు.. కొద్దిసేపటికే భారీ వర్షం కారణంగా పనులను నిలిపివేసి ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ పరిస్థితి అన్ని మండలాల్లో ఏర్పడింది. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని తెలియడంతో వర్షం తగ్గే వరకు వ్యవసాయ పనులను వాయిదా వేసుకున్నారు. ముసురు కారణంగా వివిధ పనుల నిమిత్తం జిల్లాకేంద్రానికి వచ్చిన ప్రజలు.. నగర జనం.. చిరువ్యాపారులు.. కార్మికులు అవస్థలకు గురయ్యారు. అంతటా పంట పొలాలు జలమయమై చెరువులను తలపించాయి.



శ్రీకాకుళంలో కురుస్తున్న వర్షం

కల్తీ.. తూకంలో దగా

- మోసం చేస్తున్న బియ్యం వ్యాపారులు
- రంగురంగుల ప్యాకింగ్‌తో బురిడీ
- 26 కేజీల పేరుతో జీఎస్టీ ఎగనామం



- నరసన్నపేటలో ఒక కిరాణా షాపులో జమ్ము గ్రామానికి చెందిన బి.మోహనరావు ఇటీవల వివాహ శుభకార్యం నిమిత్తం ఐదు బస్తాల సన్నబియ్యం కొనుగోలు చేశారు. పెళ్లిరోజున వంటకాలు చేసే సమయంలో బియ్యం బస్తాలు తెరవగా.. సన్నబియ్యం 60శాతం.. 40శాతం మిగతా రేషన్ బియ్యం కల్తీ చేసినవి ఉన్నాయి. ఈ విషయాన్ని షాపు యాజమానికి ఫోన్‌లో తెలియజేయగా.. ఎక్కడో తప్పు జరిగింది. వాటిని తెస్తే.. మరో బియ్యం బస్తాలు ఇస్తామని షాపు యాజమాని తెలిపారు.

- శ్రీకాకుళం ఒక ఉపాధ్యాయుడు సన్నబియ్యం బస్తా కొనుగోలు చేశారు. బియ్యం బస్తాపై 26 కేజీల ముద్ర ఉంది. తీరా తూకం వేస్తే 25కేజీలు మాత్రం ఉన్నాయి. దీనిపై షాపు యాజమానిని ప్రశ్నించగా.. బస్తాపై 25 కేజీలు ఉంటే జీఎస్టీ వసూళ్ల చేస్తారు. కాబట్టి.. బియ్యం బస్తాపై 26 కేజీలు ఉన్నట్టు ముద్రించినా.. మీ దగ్గర 25 కేజీలకే డబ్బులు తీసుకుంటున్నామని షాపు యాజమాని చెప్పారు.

నరసన్నపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నరసన్నపేట, శ్రీకాకుళం, కోటబొమ్మాళి, టెక్కలి, పలాస, ఆమదాలవలస తదితర పట్టణాల్లో సన్నబియ్యం పేరుతో బియ్యం వ్యాపారులు వినియోగదారులను దోచుకుంటున్నారు.ఓవైపు కల్తీ.. మరోవైపు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. మరికొందరు రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి.. సన్నబియ్యం పేరిట వివిధ బ్రాండెడ్ కంపెనీలకు చెందిన రంగుల బస్తాలో ప్యాకింగ్ చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారు. మిల్లర్లు, వ్యాపారులు ఒక్కటై అక్రమాలు సాగిస్తున్నారు. గ్రామాల్లో కొంతమంది రైతులు సైతం కొన్నాళ్లుగా ధాన్యాన్ని మిల్లింగ్ చేసుకోవడం లేదు. సన్నబియ్యం కొనుగోలు చేసుకునే తింటున్నారు. దీంతో బియ్యం వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతోంది. రైస్‌మిల్లర్లు కొందరు లోకల్ బ్రాండ్లు ఉన్న బస్తాల్లో రేషన్ బియ్యం నింపి విక్రయిస్తున్నారు. మరికొందరు హోల్‌సేల్ వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేసి.. మిల్లింగ్ వేయించి ఇష్టానుసారంగా బ్రాండ్ల పేరుతో బియ్యం విక్రయాలు సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం 25కిలోల బియ్యం బస్తాకు జీఎస్టీ చెల్లించాలి. ఈ నేపథ్యంలో బస్తాపై 26 కిలోలుగా ముద్రిస్తూ వ్యాపారులు జీఎస్టీకి ఎగనామం పెడుతున్నారు. మరోవైపు ఆ బస్తాలో రెండు, మూడుకిలోల బియ్యం తగ్గించి విక్రయిస్తూ వినియోగదారులను మోసగిస్తున్నారు.

కొందరు బియ్యం వ్యాపారులు మిల్లర్లతో మిలాఖత్ అయి.. ముందుగానే 100 కేజీల బియ్యంలో 25 కేజీలు సాధారణ బియ్యాన్ని లేదా రేషన్ బియ్యాన్ని కల్తీ చేస్తున్నారు. మిల్లర్లు మరపెట్టే సమయంలో 75 కేజీల సన్నరకం బియ్యాన్ని పాలిస్ చేస్తారు. వాటిని ఒక పెద్ద బస్తాలో వేస్తారు. తర్వాత 25 కేజీల రేషన్ బియ్యాన్ని పాలిస్ చేసి.. మెరుపు వచ్చేందుకు నూనె వేస్తారు. రెండు కల్తీ చేసి బస్తాల్లో ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు.

సార్ట్‌టెక్స్ పేరుతో దోపిడీ

బియ్యం వ్యాపారులు కొందరు సార్ట్‌టెక్స్ పేరుతో దగాకు పాల్పడుతున్నారు. సార్ట్‌టెక్స్‌లో (మిగతా 6వ పేజీలో..)



శ్రీకాకుళం కొత్త బ్రిడ్జి సమీపాన గోతులమయమైన రహదారి

నగర రహదారుల సొగసిదీ

- శ్రీకాకుళంలో ఎక్కడికక్కడ గోతులు..
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

6లో

గంజాయి తెచ్చి.. ప్యాకెట్లలో విక్రయించి..

- 10 మంది యువకుల అరెస్టు
- 22.5 కేజీల నిల్వల స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ అవతారం, వెనుక నిందితులు

రణస్థలం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆ యువకులు గంజాయి మత్తుకు బానిసయ్యారు. ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేసి తెచ్చి.. ప్యాకెట్లుగా తయారుచేసి స్నేహితులకు విక్రయించేవారు. ఈ క్రమంలో పది మంది యువకులు జేఆర్ పురం పోలీసులకు చిక్కారు. సోమవారం జేఆర్ పురం పోలీసుస్టేషన్‌లో సీఐ ఎం.అవతారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురం గ్రామానికి చెందిన బగాన పవన్‌కుమార్, పూసపాటిరేగ మండలం కొత్త కొప్పెర్లకు చెందిన ఇనకోటి ముకుంద, ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా మొలగాడకు చెందిన గుంత శుక్ర, శ్రీకాకుళం పెద్దరెల్లి వీధికి చెందిన తుపాకుల అనిల్‌కుమార్, ఎచ్చెర్లకు చెందిన లక్కవరపు పవన్‌కుమార్ నుంచి 22.483 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. శనివారం బాగాన పవన్‌కుమార్, ఇనాకోటి ముకుంద కలిసి ద్విచక్రవాహనంపై ఒడిశా రాష్ట్రం కోరాపుట్ దగ్గర పొత్తంగి వెళ్లి గుంత శుక్ర వద్ద 22.5కిలోల గంజాయి కొనుగోలు చేశారు. ఈ గంజాయిని అరకేజీ చొప్పున ప్యాకెట్లుగా తయారుచేసి వారు స్నేహితులకు విక్రయిస్తారు. ఈక్రమంలో ఆదివారం పైడిభీమవరంలోని టౌన్‌షిప్ వద్దకు వీరు చేరుకుని, గంజాయి తాగి, గంజాయి ప్యాకెట్లను (మిగతా 6వ పేజీలో..)



ఆధ్యాత్మికం.. పర్యావరణ హితం

- మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న వైనం
- సామాజిక సేవకుల ఉదారత



వినాయక ఉత్సవాలను ఉత్సాహంగా నిర్వహించడమే కాదు.. పర్యావరణాన్నీ పట్టించుకోవాలని సూచిస్తున్నారు కొంతమంది వ్యక్తులు. అందులో భాగంగా ఓ అడుగు ముందుకేసి... తామే చొరవ చూపి... మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై ర్యాలీలు నిర్వహిస్తూ.. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

20వేల మట్టి వినాయకులు సిద్ధం



డాక్టర్ సతీష్

కోటబొమ్మాళి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ ఆసుపత్రి వైద్యులు, డాక్టర్ రుచి హెల్త్ డ్రిక్స్ సంస్థ అధినేత డాక్టర్ హెచ్.సతీష్ ఆధ్వర్యంలో ఏటా ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది 20 వేల మట్టి వినాయకులను తయారు చేశామని డాక్టర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను మాత్రమే వాడాలని ఆయన సూచించారు. వినాయక విగ్రహాల్లో పండ్ల విత్తనాలు మట్టిలో కలిపి తయారు చేశామని... వీటిని తక్కువ నీరు ఉన్న చోట నిమజ్జనం చేస్తే పండ్ల మొక్కలు మొలుస్తాయని చెప్పారు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న మట్టి వినాయకులు

12 సంవత్సరాలుగా..



మోహన్‌గాంధీ

జలుమూరు (సారవకోట), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అవలింగి గ్రామానికి చెందిన జేబీటీ పాఠశాల నిర్వహకులు మోహన్‌గాంధీ 12 ఏళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను గ్రామాల్లో ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఏటా వెయ్యి చొప్పున మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్టు మోహన్‌గాంధీ తెలిపారు. సారవకోట, జలుమూరు, నరసన్నపేట మండలాల్లో ఇంటింటికీ పంపిణీ చేసినట్టు తెలిపారు.



మట్టి వినాయక విగ్రహాలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తొమ్మిదేళ్లుగా..

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకులకు పూజ చేసే వారి సంఖ్యను పెంచి.. పర్యావరణాన్ని కాపాడాలని ప్రయత్నిస్తున్న వారిలో శ్రీకాకుళం ఎన్విరాన్‌మెంట్ చైర్మన్ పొన్నాడ రవి ఒకరు. ఏటా 10000 పైగా మట్టి వినాయకులను పంచుతున్నారాయన. తొమ్మిదేళ్లుగా వీటిని పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఏటా 5 వేలకు పైగా విగ్రహాలను పంపిణీ చేయడం వల్ల లయన్స్ క్లబ్ గవర్నర్ సూర్యనారాయణ తనను శ్రీకాకుళం ఎన్విరాన్‌మెంటల్ చైర్మన్ ఎంపిక చేశారని తెలిపారు. నగరంలోని వివిధ కూడళ్లలో ఏటా వీటిని పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ ప్రయత్నంలో..

నరసన్నపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): 'మట్టి గణపతిని పూజిద్దాం' అనే నినాదంతో పట్టణంలోని కొంతమంది కొన్నేళ్లుగా మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్నారు. కంబకాయికి చెందిన జైశ్రీమన్నారాయణ సేవా సంఘం, పట్టణంలోని పుంబుకార్ షాపింగ్ మాల్ అధినేతలు వీటిని పంపిణీ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు.



నరసన్నపేటలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం

మట్టి విగ్రహాలపై అవగాహన కల్పిస్తూ..



నటుకుల మోహన్

అరసవల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరానికి చెందిన నటుకుల మోహన్ ఆధ్వర్యంలో 2010 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. మొదట 200 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినట్టు వెల్లడించారు. ఏటా స్కూళ్లలో చిన్నారులకు ప్రతిమల తయారీలో శిక్షణ ఇచ్చి, పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. వారం రోజులుగా మట్టి ప్రతిమల పంపిణీ ప్రారంభించామన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలతో సంప్రదించి, ఈ కార్యక్రమంలో అందరినీ భాగస్వాములను చేస్తున్నామని వివరించారు.

వినాయక విగ్రహాలకు ప్రాణం

పలాసరూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పలాస మండలం కేశుపురం గ్రామానికి చెందిన పి.విజయ్ అనే కళాకారుడు తన నైపుణ్యంతో మట్టి వినాయక విగ్రహాలకు అద్భుతంగా తయారు చేస్తున్నారు. విగ్రహాలు తయారు చేయడమే కాకుండా మట్టి ఆవశ్యకతపై యువతకు వివరించి అందజేస్తున్నారు. ప్రస్తుతం ప్లాస్టర్‌ఆఫ్ పారిస్‌తో విగ్రహాలు జోరుగా తయారవుతుండడంతో వాటికి పోటీగా కేవలం మట్టి, గడ్డి, కలపను ఉపయోగించి తయారు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. శివుడి రూపంలో వినాయకుడు, రామావతారంలో వినాయకుడు, ఆంజనేయుడు భుజంపై కూర్చుని ఉన్న వినాయకుడు వంటి విగ్రహాల తయారీలో సిద్ధహస్తులు. ఒకపక్క ఆటో డ్రైవింగ్ చేస్తూ ఆసక్తితో వినాయకుడి విగ్రహాలతో పాటు అమ్మవారి విగ్రహాలు మట్టితోనే తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు.





రైల్వే పట్టాలు దాటుతున్న విద్యార్థులు, స్థానికులు

ప్రమాదాల దారిలో..

కోటబొమ్మాళి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు యలమంచలి పంచాయతీ గురువెళ్లిపేట వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాసేజ్‌లో భారీగా వరద నీరు చేరింది. దీంతో ఆ గ్రామ ప్రజలతో పాటు విద్యార్థుల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ట్రాక్‌కు ఇరువైపులా డ్రైనేజీలు మూసివేయడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి... అండర్ పాసేజ్‌లోకి చేరుతోంది. దీంతో గ్రామస్థులు, విద్యార్థులు సైకిళ్లు, ఇతర వాహనాలతో ప్రమాదకర స్థితిలో రైల్వే ట్రాక్‌ను దాటుతున్నారు. రైల్వే అధికారులు స్పందించి రైల్వే లైనుకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. లేదంటే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నగర రహదారుల సొగసిదీ

- శ్రీకాకుళంలో ఎక్కడికక్కడ గోతులు..
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పేరుకే శ్రీకాకుళం నగరం.. ఏమున్నది గర్వకారణం అన్నట్టు ఉంది నగరపాలక సంస్థలో రహదారుల దుస్థితి. ప్రభుత్వం ఒకవైపు నగరీకరణ అంటోంది. కానీ శ్రీకాకుళంలో ఎక్కడ చూసినా క్షేత్రస్థాయిలో రహదారుల పరిస్థితి అధ్వానంగా కనిపిస్తోంది. ఏడురోడ్ల జంక్షన్ నుంచి డేఅండ్‌నైట్ జంక్షన్ వరకు రోడ్డు గోతులమయంగా మారింది. గుజరాతిపేట నుంచి పాలిటెక్నిక్ కాలేజ్, వెంకటాపురం వరకు రోడ్డు దయనీయంగా తయారైంది. సింహద్వారం నుంచి కొత్తబ్రిడ్జి వరకు రహదారిదీ అదే పరిస్థితి. కొన్నిచోట్ల స్పీడ్‌బ్రేకర్లు చెంతనే గోతులు ప్రయాణికులు, వాహన చోదకుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. ఎక్కడికక్కడ రాళ్లుతేలి.. గోతులమయంగా మారడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలను కలుపుతూ ఉన్న అనుసంధాన రోడ్లు కూడా ఛిద్రమయ్యాయి. కాలువలు కూడా సక్రమంగా లేక రహదారులపై మురుగునీరు ప్రవహిస్తోంది. కొన్నేళ్లుగా శ్రీకాకుళం కార్పొరేషన్‌కు పాలకవర్గం లేదు. ప్రత్యేకాధికారులు కూడా రహదారులను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రహదారులు బాగుచేయాలని నగరవాసులు కోరుతున్నారు.



పాలిటెక్నిక్ కళాశాల రోడ్డులో పెట్రోల్ బంక్ సమీపాన రోడ్డుపై చేరిన మురుగు



కృష్ణా పార్కు వద్ద పాలకొండ రోడ్డు..



గుజరాతీపేట నుంచి పీఎన్ కాలనీ జంక్షన్‌కు వెళ్లే రోడ్డు..

మా మంచి ఉపాధ్యాయురాలు

- మూతపడిన పాఠశాలను తెరిపించారు

టెక్కలి రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది విద్యార్థులు లేక.. మూతపడిపోతుందనుకున్న పాఠశాల.. ఉపాధ్యాయురాలి చొరవతో తెరచుకుంది. గంగన్నపేట మండల పరిషత్ పాఠశాలలో ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో ఇద్దరు విద్యార్థులే మిగిలారు. కొత్తగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయరాలు భవానికి ఏం చేయాలో అర్థం కాలేదు. దీంతో గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లలకు వర్తించే పథకాలు, సౌకర్యాలను గూర్చి వివరించారు. ఇరుగు పొరుగు గ్రామాల పెద్దలతోనూ ఇలాగే చర్చించారు. ఇలా 18 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించగలిగారు. ఇటీవల జిల్లా పూర్వ విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య పాఠశాలకు వెళ్లి... ఆమెను అభినందించారు. గ్రామస్థుల సహకారంలో పాఠశా లకు రంగులు వేయించారు. వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పేరుతో నిధులు మంజూరు చేసినా పాఠశాలలో పనులు జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వంటశాల నిర్మాణంతో పాటు ఆటస్థలాన్ని బాగు చేయించారు.ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధించడంతో పాటు సౌకర్యాలు సమకూర్చడంతో విద్యార్థులు ఆసక్తిగా చదువుతున్నారు.



విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు భవాని

త్వరితగతిన అర్జీలు పరిష్కరించండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- గ్రీవెన్స్‌కు 102 వినతులు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక మీకోసం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 102 వినతులను స్వీకరించారు. ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా, సంబంధిత శాఖల అధికారులు స్వయంగా పర్యవేక్షించి, అర్జీలకు పరిష్కారం చూపాల న్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వర రావు, ఉప కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా పాల్గొన్నారు.

పింఛన్ల నిలుపుదల దారుణం

పింఛన్ల ఆధారంగా బతుకుతున్నామని, అయితే రీ వెరిఫికేషన్ పేరుతో పింఛన్ ఆపివేయడం తగదని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జడ్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. జిల్లాలో నాలుగు వేల మంది పింఛన్‌కు దూరమయ్యారని, రీ వెరిఫికేషన్‌లో 40 శాతం కంటే తక్కువ చూపించి, పింఛన్‌కు అనర్హులుగా చేసే ప్రయత్నం జరుగుతోందని, ఇది సరికాదన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వయంగా బయటకు వచ్చి దివ్యాంగులను కలిసి మాట్లాడారు. డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ డా.కల్యాణ బాబుల సమక్షంలో వారి ఇబ్బందులపై చర్చించి, తక్షణ పరిష్కారానికి ఆదేశించారు. అనంతరం దివ్యాంగులు అక్కడే కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఇదే విషయమై మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, పేరాడ తిలక్ జడ్పీ చైర్మన్ పిరియా విజయ వినతిపత్రం అందజేశారు.

రెవెన్యూ హోదా కల్పించాలి

జి.సిగడాం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): దవళపేట గ్రామానికి రెవెన్యూ హోదా కల్పించాలని మాజీ సర్పంచ్ కంచరాన సూరన్నాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళం జడ్పీలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సుమారు 40 ఏళ్ల కిందట గ్రామాన్ని సంతవురిటి గ్రామ పంచాయతీ నుంచి దవళపేట పంచాయతీగా ఏర్పాటు చేశారని, రెవెన్యూ హోదా ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. నీటి సంఘం అధ్యక్షుడు ఎన్ని శ్రీనివాసరావు, నర్సింగరావు, మొదలవలస సత్యం, హెచ్.లక్ష్మణరావు. పి.నారాయన రావు తదితరులున్నారు. ఈ విషయమై ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్), విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులకు వినతి పత్రం అందించారు.



నిరసన తెలుపుతున్న దివ్యాంగులు



పల్లెవెలుగు బస్సు ఎక్కేందుకు తంటాలు పడుతున్న ప్రయాణికులు

సాయంత్రమైతే కిటకిట

అరసవల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నగరంలో స్కూళ్లు, కాలేజీలు విడిచిపెట్టాక విద్యార్థులు ఇంటికెళ్లేటప్పుడు ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిటలాడుతోంది. సోమవారం సాయంత్రం ఓవైపు వర్షం కురుస్తుండగా.. విద్యార్థులు బస్సులు ఎక్కేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. ఒక బస్సులో అయితే తోపులాట చోటుచేసుకుంది. గ్రామాల నుంచి నగరానికి వచ్చే విద్యార్థులకు ఈ కష్టాలు ఎన్నాళ్లోనని స్థానికులు చర్చించుకున్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని విద్యార్థినులు కోరుతున్నారు.



బస్సు ఎక్కేందుకు అవస్థలు పడుతున్న దృశ్యం

కల్తీ.. తూకంలో దగా

(ఐదో పేజీ తరువాయి)

బియ్యంలో 0 శాతం బ్రోకింగ్ బియ్యం (నూకలు), బియ్యంపై ఎటువంటి మచ్చ(రంగుమారిన) అనేది ఉండకూడదు. కానీ కొన్ని కంపెనీలకు చెందిన బస్తాలపై సార్ట్‌టెక్స్ పేరుతో కనిపిస్తాయి. తీరా ఇంటికి తీసుకెళ్లి ఆ బియ్యం బస్తా తెరవగా.. బియ్యంలో రాళ్లు, నూకలు, రంగుమారిన గింజలు అక్కడక్కడ కనిపిస్తూ ఉంటాయి. సార్ట్‌టెక్స్ బియ్యం బస్తా(25కేజీలు)పై రూ.150 నుంచి రూ.300 వరకు అదనంగా విక్రయిస్తున్నారు. ఇలా క్వింటా బియ్యానికి సార్ట్‌టెక్స్ పేరుతో నూనె కలిపి మరపట్టిన బియ్యానికి అదనంగా రూ.1200వరకు మిల్లర్లు, వ్యాపారులు దోచేస్తున్నారు.

ధాన్యం బస్తాకు ధర తక్కువే..

ఈ ఏడాది రైతులు పండించే సన్నరకాల ధాన్యానికి సరైన ధర లేకపోవడంతో రైతుల వద్ద మిల్లర్లు 80కేజీల బస్తా రూ.1600 నుంచి రూ.1700 వరకు కొనుగోలు చేశారు. ఈ సన్నబియ్యం మరపెడితే సుమారు 55 కేజీల బియ్యం దిగుబడి వస్తుంది. వీటిని ప్యాకింగ్ చేసి ఒక్కో బియ్యం బస్తాను(26 కేజీలు) రూ.1200 నుంచి రూ.1400కు విక్రయిస్తున్నారు. అంటే రెండు బస్తాల బియ్యాన్ని రూ.2,800 వరకు విక్రయిస్తున్నారు. మిల్లర్లుకు మరపెట్టేందుకు, హమాలీ వేతనాలు, విద్యుత్ చార్జీలు, ఇతర ఖర్చులకు మిల్లింగ్ చేపట్టే పొట్టు, తవుడు, బ్రోకెన్ బియ్యం సరిపోతాయి. ఇలా రైతుల నుంచి ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి.. బస్తాకు రూ.వెయ్యి వరకూ మిల్లర్లు, వ్యాపారులు లాభపడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

బియ్యం తూకం తక్కువ విషయంలో కానీ, జీఎస్టీ చెల్లించని వ్యాపారులపై కానీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మిల్లర్లు, వ్యాపారుల వద్ద కొంతమంది అధికారులు మామూళ్లు తీసుకుని అక్రమాలను చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారిణి చిన్నమ్మి వద్ద ప్రస్తావించగా 'ఇప్పటికే టెక్కలి, నరసన్నపేట తదితర ప్రాంతాల్లో షాపులపై దాడులు నిర్వహించాం. తూకాల్లో మోసాలు చేసే వ్యాపారులపై కేసులు నమోదు చేశామ'ని తెలిపారు. తూకంలో మోసం చేసినా, కల్తీకి పాల్పడినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

గంజాయి తెచ్చి.. ప్యాకెట్లలో విక్రయించి..

(ఐదో పేజీ తరువాయి)

పంచుకున్నారు. హైదరాబాద్‌లో ఉన్న బాడాన సౌమిత్‌కు, బెంగుళూరులో ఉన్న ఎం.సందీప్‌కు గంజాయిను విక్రయించే క్రమంలో వీరు పోలీసులకు పట్టుబడ్డారు. అలాగే గంజాయి తాగడానికి అలవాటు పడిన లంకలపల్లి దినేష్, ఆళ్ల వెంకటరమణ, సురవరపు వరప్రసాద్, బీవీ వెంటప్రతాప్, ముడిల మోహన్‌వెంకటప్రతాప్‌పై కూడా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ అవతరాం తెలిపారు. మొత్తంగా పదిమందిని అరెస్టు చేశామన్నారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించడంలో ప్రతిభ చూపిన సీఐ ఎం.అవతారం, ఎస్‌ఐలు ఎస్.చిరంజీవి, జి.లక్ష్మణరావు, ఏఎస్‌ఐ ఎన్.ఉమామహేశ్వరరావు, హెచ్‌సీ కె.కిరణ్‌కుమార్‌సింగ్‌ను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అభినందించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

రాష్ట్రప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ సోమవారం ప్రారంభించారు. పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు లబ్ధిదారులకు వీటిని అందించారు.

రేషన్ అక్రమాలకు చెక్: రవికుమార్

ఆమదాలవలస, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం స్మార్ట్ కార్డులను ప్రవేశ పెట్టిందని ఎమ్మెల్యే కూన రవి కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని 15వ వార్డు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్యూర్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డు వల్ల పౌర సరఫరాల వ్యవస్థలో పాదరర్శకత తీసుకు రానున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, తహసీల్దార్ ఎస్.రాంబాబు, మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, రాష్ట్ర మెడికల్ బోర్డు కౌన్సిల్ సభ్యుడు చాపర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఆమదాలవలస: స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


గార రూరల్: స్మార్ట్ కార్డును అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

పారదర్శకంగా ప్రజా పంపిణీ: శంకర్

శ్రీకాకుళం రూరల్/గార రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం, నగర పరిధి కాజీపేట, గార మండలం రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడు గ్రామాల్లో సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎస్‌వో సూర్య ప్రకాశరావు, తహసీలార్ చక్రవర్తి, ఎంపీడీవో రఘు, టీడీపీ నేతలు మాదారపు వెంకటేష్, రాధాకృష్ణారెడ్డి, సింగుపురం సర్పంచ్ గుండ ఆదిత్య నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి: ఎన్ఈఆర్

రణస్థలం/లావేరు/జి.సిగడాం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నడుకుడిటి ఈశ్వరరావు అన్నారు. ప్రభుత్వ మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం రావాడ చిన ముర పాక, మెట్టవలస గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులను కూడా చేపడుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చౌదరి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.


రణస్థలం: రావాడలో స్మార్ట్ రేషన్ కార్డును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం: బగ్గు

జలుమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆ దిశగా చంద్రబాబునాయుడు పాలన సాగుతోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. చల్లవానిపేట గ్రామ సచివాలయంలో స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. జీవనోపాధి కోసం వలస వెళ్లే కార్మికులకు కూడా ఈ కార్డులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జలుమూరు, సారవకోట తహసీల్దార్లు జె.రామారావు, విజయలక్ష్మి, సీఎస్‌డీటీ జాఫర్ షరీఫ్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు, చల్లవానిపేట, అల్లాడ సొసైటీ చైర్మన్‌లు దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణరావు, పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులకు మెరుగైన వైద్యంపై శిక్షణ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): హైరిస్క్ గర్భిణులను సకాలంలో గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలందించే లక్ష్యంతో పీహెచ్‌సీలోని వైద్యాధికారులకు సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో అవగాహన కలిగించారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ ట్రాకింగ్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రొటోకాల్స్, ఐహెచ్ఆర్‌టీఎంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డా.సుజాత, ఎపిడిమాలజిస్ట్, జీవీ లక్ష్మి, ట్రైనింగ్ స్కూల్ ప్రిన్సిపాల్, బి.ముఖలింగం, హెచ్ఈఈవో, డెమో వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యార్థిని భవిష్యత్‌కు భరోసా

గార రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థిని గుజ్జల రేవతి భవిష్యత్‌కు తన సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ భరోసా ఇచ్చారు. కొర్ని గ్రామానికి చెందిన రేవతి తండ్రి చిన్నతనంలో చనిపోగా తల్లి పార్వతమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం పరామర్శించారు. విద్యార్థిని బాగోగులు చూసుకునేందుకు దత్తత తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం గ్రామంలోని జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతోందని, ఉన్నత చదువులతోపాటు ఉద్యోగం, వివాహ బాధ్యతను తీసుకొని బంగారు బాట వేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు లోపింటి రాధా కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ దశరథరావు పాల్గొన్నారు.

జీజీవలస అభివృద్ధికి ప్రణాళికలు

లావేరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న ఏకైక గిరిజన గ్రామం జీజీవలస అభివృద్ధికి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో పి.వెంకటరాజు అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆదికర్మయోగి పథకంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

కర్మయోగి అభియాన్‌పై శిక్షణ

కంచిలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కంచిలి మండల పరిషత్ కార్యాలయంలో ఆది కర్మయోగి అభియాన్‌పై వివిధ శాఖల అధికారులకు శిక్షణ కార్య క్రమం సోమవారం నిర్వహించారు. ఈ పథకం కింద నవగడ గ్రామ పంచాయతీని ఎంపిక చేశారు. మంగళవారం కూడా శిక్షణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి: ఎస్పీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్వీకరించే ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన విచారించి పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు, పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ 55 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

బీపీ మండల్ కృషితోనే రిజర్వేషన్లు


మండల్ విగ్రహం వద్ద నేతల నివాళి

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బీపీ మండల్ చేసిన సిఫారసులతోనే బీసీల రిజర్వేషన్లు అమలవుతున్నాయని బీసీ సంఘం నేతలు అన్నారు. బీపీ మండల్ జయంతి సందర్భంగా స్థానిక జ్యోతిబా పూలే పార్కులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిం చారు. కార్యక్ర మంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు హాజీ అమిరుల్లా బేగ్, రాష్ట్ర జాతీయ సలహాదారు బాడాన దేవభూషణ్, ఉపాధ్యక్షులు వంజరాపు రాజులు, రాష్ట్ర కార్యదర్శి కె.గోపాల్ పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు ఉచితంగా అనుమతి

● డీఎస్పీ వివేకానంద



శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ పరిధిలో గణేష్ మండపాల ఏర్పా టుకు ఎటువంటి చలానా చెల్లించకుండా ఉచితంగా అనుమతులు పొందవచ్చని టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హెచ్‌టిటిపిఎస్://జీఎఎస్ఈఎస్ యుటీఎస్ఏవి.నెట్ ద్వారా పోలీసుల అనుమతి పొందవచ్చన్నారు. పోలీస్ శాఖ జారీ చేసిన భద్రతా నిబంధనలు, జాగ్రత్తలు కమిటీ నిర్వా హకులు పాటించాలన్నారు. మండ పాల వద్ద ఇసుక, నీటిని అందు బాటులో ఉంచుకోవాలన్నారు. పోలీసులు అనుమతించిన మా ర్గాల్లోనే విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకొని వెళ్లాలని సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్ర మే ఉపయోగించాలన్నారు. అనుమతులు లేకుండా డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసు కుంటామన్నారు. నిమజ్జన కార్యక్రమానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

మండపాలను పరిశీలించిన అధికారులు


మండపాలను పరిశీలిస్తున్న సీఐ తదితరులు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేస్తున్న గణేష్ మండ పాలను సోమవారం టూటౌన్ సీఐ పి.ఈశ్వర రావు ఫైర్, విద్యుత్‌శాఖాధికారులతో కలిసి పరిశీలించారు. భద్రతా ప్రమాణాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నారా లేదాఅరా తీశారు. మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్వాహ కులకు వివరిం చారు. కొన్ని మండపాలు ఇంకా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేదని, త్వరగా అనుమతులు పొందాలన్నారు.

తెలుగుయువత కార్యవర్గం నియామకం

కవిటి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల తెలుగుయువత కార్యవర్గాన్ని సోమవారం నియమించారు. అధ్యక్షుడిగా కె.వెంకట రావు, ఉపాధ్యక్షుడిగా బి.విష్ణుమణి, ప్రధానకార్యదర్శిగా రఘుపాత్రుని శ్రీనివాస్ నియమితులయ్యారు. అలాగే కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎర్ర మురళి, టి.త్యాగరాజు, బి.తేజేశ్వరరావు, కార్యదర్శులుగా బి.కనకరావు, సీహెచ్ జానకిరాం, దుదిష్టి బిసాయి, కోశాధికారిగా బి.అశోక్‌లను నియమించారు. ఈమేరకు టీడీపీ మండల అధ్యక్షుడు పి.కృష్ణారావు ఒక ప్రకటన విడుదల చేశారు.

బాధిత కుటుంబాలకు తమ్మినేని పరామర్శ

ఆమదాలవలస, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం పరామర్శించారు. కృష్ణాపురం, వంజంగి, పొందూరు పట్టణాల్లో పలు కుటుంబాలను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను తక్షణం పరిష్కరిం చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పి.పవిత్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా విద్యార్థులు ధర్నాలో పాల్గొని సమస్యలపై నినదించారు. 2018లో ఆర్ట్స్ కళాశాల హాస్టల్‌కి రూ.15 కోట్లు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ కేటాయించలేదన్నారు. రూ.6400 కోట్లు ఫీజు రీఇంబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం బకాయిలను చెల్లించాలని, జీవో నెంబర్-77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీ-ఇంబర్స్ మెంట్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డి.చందు, ఖగేష్, చిన్నా, జయరాం తదితరులు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథంతో మానసిక ఆరోగ్యం

● డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్


హిప్నాటిజం చేస్తున్న డాక్టర్ పద్మా కమలాకర్

ఎచ్చెర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సానుకూల దృక్పథంతో మానసిక ఆరోగ్యం సాధ్యమని ప్రొగెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, ప్రముఖ హిప్నో థెరపిస్ట్ డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో సోమవారం 'హిప్నాటిజం షో-యువశక్తి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్క రిలో ఉండే శక్తి సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదన్నారు. మత, సామా జికపరమైన మూఢ విశ్వాసాలు మనిషిని శాస్త్ర విజ్ఞానం నుంచి దూరం చేస్తున్నాయన్నారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ.. హిప్నాటిజం మానసిక వికాసానికి, అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్ర మంలో వర్సిటీ సైకలాజికల్ అసెస్‌మెంట్, కౌన్సెలింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జేఎల్ సంధ్యారాణి, రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా గణపతిని పూజించాలి


మట్టి వినాయక ప్రతిమలతో విద్యార్థులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణహితంగా మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ అన్నారు. సోమవారం విద్యార్థులతో మట్టి విగ్రహాలు తయారు చేయించి పంపిణీ చేశారు. పీవోపీ వల్ల జల కాలుష్యం పెరు గుతుందన్నారు. అందువల్ల మట్టి విగ్రహాలను పూజించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, ధర్మరాజు, జ్యోతి, రేణుక, స్వప్న, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈదుపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఎన్‌జీసీ విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేసి గ్రామంలో పంపిణీచేశారు. మట్టి విగ్రహాలకు పూజించాలని కోరారు.

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

సోంపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక విగ్రహాలను రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమ వారం పంపిణీ చేశారు. గత ఐదేళ్లుగా ప్రతీ ఏటా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్ర మంలో డాక్టర్ లక్ష్మీనారాయణ, వజ్జ కృష్ణారావు, గున్న ధనుంజయ, శ్రీను, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

ధర్మశాస్త సన్నిధానం ఆధ్వర్యంలో..

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యమహల్ కూడలిలో సోమవారం ధర్మశాస్తా సన్నిధానం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కాలుష్య నివారణలో భాగంగా మట్టి గణనాథులకు పూజించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్ర మంలో సంస్థ ప్రతినిధులు బరాటం సంతోష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల సేకరణ కార్మికులకు 'నమస్తే' పథకం

ఆమదాలవలస, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలు సేకరించే కార్మికులను గుర్తించి వారికి సాధికారత కల్పించేందుకు రాష్ట్రంలో 'నమస్తే' పథకం ప్రారంభమైందని మునిసిపల్ కమిషనర్ తమ్మినేని రవి తెలిపారు. సోమవారం కార్యాలయంలో పబ్లిక్‌హెల్త్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని చేసే సమయంలో సామాజిక భద్రత కల్పించడంతో పాటు వ్యక్తిగత భద్రత పరికరాలు అందించాలన్న ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. దీనివల్ల ప్రభుత్వ పథకాలతో పాటు మెరుగైన ఆరోగ్య సేవలు లభిస్తాయని వివరించారు. రిసోర్స్ పర్సన్లు వై.చిట్టిబాబు, టి.పావని ఈపథకంపై అవగాహన కల్పించారు.

ఆదివారంపేట యూపీహెచ్‌సీకి అవార్డు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జాతీయ నాణ్యతా ప్రమాణాలు పాటించి నందుకు గాను నగరంలోని ఆదివారంపేట యూపీహెచ్‌సీకి రాష్ట్ర స్థాయిలో అవార్డు, క్యూఏఎస్ సర్టిఫికెట్ వచ్చింది. ఈ మేరకు ఈ సర్టిఫికేట్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో అందజేశారు. అలాగే ఎచ్చెర్ల, పాతర్లపల్లి, చాపర, బాతువ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లకు నాక్ లెవెల్ సర్టిఫికెట్స్, శ్రీకాకుళం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ముష్కాన్ (చైల్డ్ ఫ్రెండ్లీ హాస్పిటల్) సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.అనిత, వైద్యులు అచ్యుతరావు, సుభాషిణి, రాము, రవికుమార్, రంజిని తదితరులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్‌ను అందజేస్తున్న కలెక్టర్ పుండ్కర్

టీడీపీ బలోపేతానికి అనుబంధ కమిటీల ఏర్పాటు

● ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఎచ్చెర్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగతంగా బలోపేతానికి పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో అనుబంధ కమిటీలు ఏర్పాటు చేస్తామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. చిలకపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం పార్టీ నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుబంధ విభాగాల్లో చురుగ్గా పనిచేసేందుకు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు ముందుకు రావాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టో మేరకు సూపర్ సిక్స్‌ను అమలు చేసినట్టు చెప్పారు. ఇటీవల అమలు చేసిన స్త్రీ శక్తికి అపూర్వ ఆదరణ లభించిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, పార్టీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, నేతలు వావిలపల్లి రామకృష్ణ, పైడి ముఖలింగం, గాలి వెంకటరెడ్డి, మెండ రాజారావు, చిలక రాము తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

మెగా డీఎస్సీతో ప్రభుత్వం పారదర్శకంగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని విద్యారంగాన్ని దేశంలోనే తొలి స్థానంలో నిలిపేందుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. మెగా డీఎస్సీ జరగకుండా ఆపేందుకు మాజీ సీఎం జగన్మోహనరెడ్డి 24 కేసులు వేయించారని, వీటిని సమర్థవంతంగా తిప్పికొట్టినట్టు చెప్పారు.

యోగాసనాల్లో విజేతకు అభినందన


శ్రీకాంత్‌ను అభినందిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్, ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో బంగారు పత కాలు సాధించిన శ్రీకాంత్ మహంతిని సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అభి నందించారు. ఈనెల 21 నుంచి ఆదివారం వరకు తాడేపల్లి గూడెంలో జరిగిన 6వ రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో శ్రీకాంత్ మహంతి 28-35 వయసు విభాగంలో ట్రెడిషనల్, ట్విస్టిం గ్ ఆసనాల్లో విజేతగా నిలిచి బంగారు పతకాలు సాధించాడు. 14-18 విభాగంలో పాలేపు సాయి జగదీష్ ట్విస్టింగ్ ఆసనాల్లో రెండో స్థానంలో నిలిచాడు.

సీజీఎఫ్ చెక్కు అందజేత

కవిటి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కవిటిలోని శ్రీచంద్రశేఖర స్వామి ఆలయానికి దేవదాయ శాఖ మంజూరు చేసిన రూ.24,16,800 సీజీఎఫ్ చెక్కును సోమవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అందజేశారు. ఈ చెక్కును విశాఖపట్నంలో కవిటి సర్పంచ్ పి.లక్ష్మణరావు సమక్షంలో కాంట్రాక్టర్ పైడి బాబుకు అందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



కవిటి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మాణిక్యపురం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఎం.వైకుంఠరావు తెలిపారు. జితా నాయక్, అంజలి బిసాయి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచార న్నారు. వీరు ఈనెలాఖరులో గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థినులను అభినందించారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

రణస్థలం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎరు వులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ సీఐ డీవీవీ సతీష్ కుమా ర్, ఏఆర్ ఎర్రంనాయుడు స్పష్టం చేశారు. సోమవారం పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. కమ్మసిగడాం ఆదిత్య ట్రేడర్స్ షాప్ లైసెన్స్ రెన్యు వల్ ఆలస్యం అయినందున 14 రోజులు షాపు తెరవకూడదని ఆదేశించారు. శ్రీ కనక మహా లక్ష్మీ ట్రేడర్స్‌కు సంబంధించి బిల్లు పుస్తకాలు సక్రమంగా లేనందున 4.2 టన్నుల ఎరువుల విక్రయం నిలుపుదల చేయాలన్నారు. నానో యూరియా, డీఏపీ వాడకంపై రైతులకు అవగహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో డి.విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

షెడ్యూలు : శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలం, ...

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204



బహిరంగ ప్రకటన

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204

బహిరంగ ప్రకటన

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా
పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా
ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, శ్రీకాకుళం : 9985411535
రాజాం : 9494691912, పలాస : 9985411532

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం
అరసవల్లి, శ్రీకాకుళం జిల్లా - 532401
సవరణ సీల్డ్ టెండర్ ప్రకటన

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

క్రైం కార్నర్ రోడ్డు ప్రమాదంలో యాచకురాలి మృతి

- గుర్తు తెలియని వాహనం ఢీకొని దుర్ఘటన
- ఘటనను చూసి తట్టుకోలేక మరో యాచకుడు కూడా..


కోటి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జి.సిగడాం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వాంగ్రంగి పంచాయతీ చీడిపేట కూడలి వద్ద సోమవారం వేకువ జామున గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకురాలు బలగ భాగ్యలక్ష్మి (50) అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదాన్ని చూసి తట్టుకోలేక తోటి యాచకుడు కోటి (65) ఒక్కసారి కుప్పకూలి మృతి చెందాడు. ఈ ఘటనలు స్థానికంగా విషాదం నింపాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. లావేరు మండలం బుడుమూరు గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి, ఒడిశా రాష్ట్రానికి చెందిన కోటి కొన్నాళ్లుగా స్థానిక చీడిపేట పాతబస్టాండ్ సమీపంలో ఉన్న ఆలయం వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే సోమ వారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో భాగలక్ష్మిని గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ వై.మధుసూదన రావు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆమె మృతి ఘటన చూసిన కోటి కూడా ఒక్కసారి బస్ షెల్టర్ వద్ద కుప్పకూలి మృతి చెందాడు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆసుపత్రికి తరలిం చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుమారుడి కళ్లెదుటే తండ్రి దుర్మరణం

హరిపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బిన్నల మదనాపురం గ్రామం వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతిచెందగా... కుమారుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. మందస పోలీసుల వివరాల మేరకు జీఆర్‌పురం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు సాసుమాను మోహనరావు(58), నరసింహులు(36) పొలం పనుల కోసం బిన్నల సమీపంలోకి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేందుకు రోడ్డు పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాన్ని సిద్ధం చేస్తుండగా... గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. దీంతో తండ్రి మోహనరావు అక్కడికక్కడే మృతిచెందగా.. కుమారుడు నరసింహులు తీవ్ర గాయాలపాలయ్యాడు. బాధితుడిని వెంటనే 108లో హరిపురం సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తిపోట్లకు గురైన వ్యక్తి మృతి


రాజశేఖర్ (ఫైల్)

జి.సిగడాం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి చేతిలో కత్తిపోట్లకు గురై శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పుక్కల్ల రాజశేఖర్ (35) సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గెడ్డ కంచరాం గ్రామానికి చెందిన రాజశేఖర్ గొబ్బూరు గ్రామానికిచెందిన దరమసింగి గొల్లబాబు అలియాస్ శంకర్ మంచి స్నేహితులు. అయితే ఆదివారం రాత్రి ఇరువురి మధ్య జరిగిన వివాదంలో రాజశేఖర్‌ను శంకర్ కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. మృతుడు రాజశేఖర్‌కు భార్య హరిప్రియ, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మత్స్యకార కులానికి చెందిన రాజశేఖర్, తమ్ముడు అన్వేష్ గృహ, ఇతర నిర్మాణాలకు పెయింటింగ్ వేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. రాజశేఖర్ మృతితో కుటుంబపెద్దను కోల్పోయామని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. మంచి క్రీడాకారు డైన రాజశేఖర్ పెయింటింగ్ పనులు చేస్తూనే క్రికెట్ తదితర క్రీడల్లో పాల్గొంటూ మంచి వ్యక్తిగా గుర్తింపు పొందారు. అందరితో మంచిగా, కలివిడిగా ఉండే రాజశేఖర్ మృతి చెందిన విష యం తెలుసుకుని గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో...

కోటబొమ్మాళి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మేజరు పంచాయతీ వైశ్య వీధికి చెందిన మల్లా రమేష్ (55) విద్యుత్ షాక్‌తో సోమవారం సాయంత్రం మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు రమేష్ పిండిమిల్లు నడుపుతూ కుంటుబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం సాయంత్రం యంత్రాన్ని ఆపేందుకు విద్యుత్ స్విచ్‌పై చేయి వేయటంతో షాక్‌తో కింపడి, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య వాణి, ఇద్దరు కుమార్తెలు వెన్నెల, అఖిల ఉన్నారు. దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పాతకోటలో కార్డన్‌సెర్చ్


వాహనాలు పరిశీలిస్తున్న పోలీసులు

హరిపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మందస మండలం ఏజెన్సీ ప్రాంతమైన బుడార్సింగి పంచాయితీ పాతకోటలో ఎస్ఐ కె.క్రిష్ణప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ఇళ్లను, వాహనాలను, వ్యక్తులను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. నేరాల నియంత్రణలో భాగంగా ఈ తనిఖీలను చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

పాతపట్నం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పాతపట్నం పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ అన్నెపు వైకుంఠరావు(55) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన స్వగ్రామం టెక్కలి మండలం బలరాంపురం. మృతునికి భార్య నాగమణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రైలు ఢీకొని మూడు గొర్రెలు మృతి

పాతపట్నం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పాతపట్నం రైల్వేస్టేషన్‌కు చేరువలో సోమవారం రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో మూడు గొర్రెలు మృతిచెందాయి. మరో మూడు తీవ్రంగా గాయపడ్డాయి. వాటి యజమానులు పి.నీలకంఠం, పి.లక్ష్మీనారాయణ, అప్పలస్వామి రోదిస్తున్నారు.

లోక్ అదాలత్‌పై అవగాహన పెంచండి

నరసన్నపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయవాదులు, పోలీసులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.వాణి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోయేషన్ అధ్యక్షులు కొండలరావు, ఎక్సైజ్ సీఐ జీవీ రమణ పాల్గొన్నారు.

ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

పోలాకి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలు నిర్వహించేందుకు పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలని నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రంజిత్‌కుమార్ సోమవారం తెలిపారు. సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు పొందవచ్చన్నారు.

ఉపాధ్యాయులను నియమించింది మా ప్రభుత్వమే: ఎమ్మెల్యే


ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం, కూటమి ప్రభుత్వంలోనే అధికంగా డీఎస్సీలు నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 1994 నుంచి 2025 వరకూ మొత్తం 1,96,619 ఉపాధ్యాయులను నియమించి చరిత్రలో నిలిచామన్నారు. యువతకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్యర్థులకు వయసులో సడలింపు ఇచ్చి వారికి అండగా నిలబడ్డామన్నారు. ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబు నాయుడు 13 డీఎస్సీలు నిర్వహించి.. చరిత్ర సృష్టించారని తెలిపారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయుల్లో అధికంగా ఆయన హయాంలో నియమించిన వారేనని గుర్తు చేశారు. సమగ్ర శిక్ష సొసైటీ ఆధ్వర్యంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యా లయాల్లో ఖాళీగా ఉన్న 729 నాన్‌టీచింగ్ స్టాఫ్ పో స్టులను భర్తీ చేశామని తెలి పారు. 90 మంది ఎస్టీ యువతకు కొత్తగా ఉపాధ్యాయులుగా నియమించామని, 700 కేయభారతి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని వివరించారు. జూనియర్ కళాశాలల్లో 700 మంది సిబ్బందిని నియమించామన్నారు. 476 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,919 మంది కాంట్రాక్ట్ లెక్చరర్ల సేవలు పునరుద్ధరించామని ఎమ్మెల్యే శిరీష తెలిపారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించడానికి పూర్తి స్థాయి చర్యలు తీసుకున్నామని గుర్తు చేసారు. వైకాపా హయాంలో నీతి అయోగ్ నివేదిక ప్రకారం రాష్ట్రంలో విద్యను 3వ స్థానం నుంచి 19వ స్థానానికి దిగజార్చారన్నారు. ప్రస్తుతం అన్నీ వర్గాల ప్రజలకు చేరువలో సంక్షేమ పథకాలు అందిస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా మిగిలిపోతుందని ఎమ్మెల్యే శిరీష అన్నారు.

న్యూస్ బాక్స్

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

మందస, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, దీనికి ఆదికర్మయోగి మండల స్థాయి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో తిరుమల కుమార్ అన్నారు. మందస మండల పరిషత్ కార్యాలయంలో ఆదికర్మయోగి శిక్షణ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. మండల రీసోర్స్‌పర్సన్లు గిరిజన ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధిపై సూచనలు, సలహాలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా నగేష్

టెక్కలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా అల్లు నగేష్ నియమితులయ్యారు. ఆదివారం ప్రకాశం జిల్లా కందుకూరులో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు టి.గోపాల నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ రవాణా రంగ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. జిల్లాలో అన్ని ఎంవీఐ కేంద్రాల్లో ఫిట్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి పెద్దపేట వేస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ పాలకమండలి సభ్యులుగా మావుడూరి జగదీష్, బోయిన శ్రీదేవి, కూన గాయత్రి, దంతకూర్తి బాలకృష్ణ, లకోజి విశ్వనాథం, దుప్పలపూడి పద్మ, యారాగుల సుశీలలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యాక్రమంలో రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, పొందరి, కురాకుల కార్పొరేషన్ చైర్మన్ దామోదర నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పోగోటి ఉమామహేశ్వరి, నేతింటి విశ్వేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు, ఉణ్న వెంకటేశ్వరరావు, జామి వెంకట్రావు, బోయిన ఆనంద్, పోగోటి అప్పలనాయుడు, తాళాభక్తుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసం పనిచేయాలి

జలుమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీలు రైతుల అభివృద్దే ధ్యేయంగా పని చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఆదాయ మార్గాలను అన్వేషించాలన్నారు. వచ్చే ఆదాయంతో రహదారుల నిర్మాణం, పశుపోషణ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పంటలను సకాలంలో కొనుగోలు చేసి రైతులను ఆదుకొనే దిశగా వ్యవసాయ మార్కెట్ కమిటీలు పని చేయాలన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ అధ్యక్షులు తర్ర బలరాం, ఉపాధ్యక్షులు డొక్కా వెంకటరమణ, చల్లవానిపేట, అల్లాడ సొసైటీ చైర్మన్‌లు దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణరావు, టీడీపీ నాయకులు ఎం.దామోదరరావు, కూన ప్రకాశరావు, మార్కెట్ కమిటీ కార్యదర్శి బి.శారద తదితరులు పాల్గొన్నారు.

ఇలా వచ్చింది.. అలా అయిపోయింది!


యూరియా కోసం వేచి ఉన్నరైతులు

నరసన్నపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు అగచాట్లు తప్పడం లేదు. సోమవారం పట్టణంలో ఒక ఎరువుల షాపునకు వచ్చిన 220 బస్తాల కోసం వందలాది మంది రైతులు బారులు తీరారు. ఒక్కొక్క రైతుకు ఒక్కొక్క బస్తా చొప్పున పోలీసుల సమక్షంలో వ్యవసాయ అధికారులు విక్రయింపజేశారు. స్టాక్ తక్కువగా రావడంతో గంట వ్యవధిలో 220 బస్తాలు అమ్ముడుపోయాయి. దీంతో మిగతా రైతులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. ప్రైవేటు డీలర్లకు, రైతు సేవాకేంద్రాలకు యూరియా పంపిణీ చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏడీఈ వెంకట మధు తెలిపారు.

గిరిజనుల స్థితిగతులు తెలుసుకోండి

మెళియాపుట్టి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గిరి జనుల స్థితిగతులు తెలుసుకోవాలని ఎంపీ డీవో ప్రసాద్ పండా తెలిపారు. ఆది కర్మయోగి పథకంపై రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆ కుటుంబాల అవసరాలను తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. రాజకీయాలకు అతీతంగా సర్వే నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దేవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మండల తెలుగు యువత అధ్యక్షుడిగా కిరణ్

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల తెలుగు యువత అధ్యక్షునిగా కోనారి కిరణ్ కుమార్‌ను ఎంపిక చేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సూరాడ మోహనరావు చెప్పారు. ఉపాధ్యక్షునిగా బమ్మిడి లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శిగా మురపింటి అఖిల్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా ఢిల్లీశ్వరరావు, ముగడ గిరి, భవాని, కార్యదర్శులుగా సైని కల్యాణి, రాంపాత్రుని చిరంజీవి, కలిశెట్టి స్వప్న, కోశాధికారిగా ప్రశాంత్‌ను నియమించినట్టు చెప్పారు.

తేనెటీగల పెంపకంతో ఆదాయం



ప్రసంగిస్తున్న నారాయణరావు

పాతపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల పెంపకంతో అధిక ఆదాయాన్ని పొందవచ్చని వెలుగు డీపీఎం ఎం. నారాయణరావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో తేనెటీగల పెంపకంపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటి పెంపకంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ ఎ.ప్రభాకరరావు, ఏపీఎంలు ఈశ్వరరావు, శ్రీనివాస్ బాబా, ఎస్.రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

సంతబొమ్మాళి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని దండుగోపాలపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.విశ్వనాథ్ గంగాధర్ అన్నారు. పీహెచ్‌సీలో సోమవారం కంటి ఆరోగ్యం-నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి ఎంఆర్‌కేదాస్, ఆరోగ్యవిస్తరణాధికారి వీవీ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించండి

పాతపట్నంరూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమైన రీతిలో బోధించాలని వమరవెల్లి డైట్ లెక్చరర్ వి.శరత్‌బాబు అన్నారు. సోమవారం తామర మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిశుభ్రత, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, తరగతుల వారీగా సామర్థ్యాలు, పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు ఆదర్శ పాఠ్య బోధన చేశారు. ఉత్తమ ప్రతిభను ప్రదర్శించిన పంచిరెడ్డి షణ్ముఖప్రియ, నాబెల్లి గోవిందసాయిలకు బహుమతులను అందజేశారు.

వైద్య సిబ్బందికి అభినందన

మెళియాపుట్టి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జాడుపల్లి ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో 2023లో జాతీయ నాణ్యత పర్యవేక్షణ కమిటీ పర్యటించి... 94 శాతం మార్కులు కేటాయించింది. ఇది జిల్లాలో రెండోస్థానంలో నిలవటంతో సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ధ్రువపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు వైద్యాధికారి పావని, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, సరస్వతిలను అభినందించారు.

30 మంది రక్తదానం

హిరమండలం, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సోమవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బ్రహ్మకుమారి సేవా కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు.

విస్తారంగా వర్షాలు

నందిగాం/పోలాకి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నందిగాం, పోలాకి మండలాల్లో సోమవారం విస్తారంగా వర్షం పడింది. ఉదయం ప్రారంభమైన వర్షం రాత్రి వరకు కురవడంతో వాతావరణం చల్లబడింది. ఈ వర్షాలు పంటకు ఎంతగానో ఉపకరిస్తాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. వర్షం కారణంగా వినాయక చవితి సామగ్రి అమ్మకాలకు ఆటంకం కలిగింది. అమ్మకందారులు ఇబ్బందులు పడ్డారు.

డివిజన్ మార్పుతోనే సమస్యల పరిష్కారం


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎల్ఎన్‌పేట నాయకులు


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న కొత్తూరు మండల సర్పంచులు

ఎల్.ఎన్.పేట/కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్.ఎన్.పేట మండలాన్ని టెక్కలి నుంచి శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌కు మార్చితేనే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని స్థానిక టీడీపీ, వైసీపీ నాయకులు ఎం. మనోహర్‌నాయుడు, కె. చిరంజీవి, వి.ఆనందరావు, ఎస్.సాంబశివరావు, ఎస్. కిషోర్‌బాబు తదితరులు అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎల్.ఎన్.పేట నుంచి టెక్కలికి మూడుచోట్ల బస్సులు మారి.. సుమారు 60 కిలోమీటర్ల దూరం వెళ్లవలసి వస్తోందని తెలిపారు. వాహన సౌకర్యాలు లేక ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్‌కు విన్నవించారు. తమ మండలాన్ని శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌కు మార్చాలని కోరుతూ మండల ప్రజా పరిషత్, గ్రామ పంచాయతీల తీర్మానాలను జత చేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. వీరితోపాటు పి.వెంకటరావు, జి.మోహనరావు, టి.అప్పన్న, జి. రాము, పి.రామకృష్ణ ఉన్నారు.

కొత్త మండలం ఏర్పాటు చేయండి...

కొత్తూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మెట్టూరు కేంద్రంగా కొత్తగా మండల కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ 21 మంది పంచాయతీ సర్పంచ్‌లు తీర్మానం చేసి సోమవారం కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. ఈమేరకు సర్పంచ్ ఫోరమ్ నాయకులు వెంకటరమణ, చుక్కా రాంబాబులు మాట్లాడుతూ వంశధార ప్రాజెక్ట్ కోసం సర్వస్వం ధారపోసి కట్టుబట్టలతో కొత్తూరు మండలానికి సుమారు 12 వేలు కుటుంబాలు వచ్చాయని తెలిపారు. దీంతో జనాభా పెరిగిందని.. దీనివల్ల పరిపాలన పరంగా అధికారులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు అసౌకర్యంగా ఉందని సర్పంచ్‌లు కలెక్టర్‌కు విన్నవించారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో నిర్వాహకులు

కాశీబుగ్గ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, జనరల్ సెక్రటరీ పీరుకట్ల విఠల్‌రావులు అన్నారు. సోమవారం కాశీబుగ్గలో స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష తలపెట్టిన ప్రతి చేనుకు నీరు ప్రతి చేతికి పని అనే సంకల్పంలో భాగంగా జాబ్‌మేళా నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం .వంశీక్రిష్ణ, సాయి శిరిష డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బమ్మిడి చంద్రశేఖర్, సిబ్బంది మేఘారావు, ఈశ్వరరావు, టీడీపీ నాయకులు గాలి కృష్ణారావు, శంకర్, ప్రమోద్, ఢిల్లేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మొత్తం 207 మందికి వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభించినట్టు నిర్వాహకులు తెలిపారు.

ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న గోవిందరావు

టెక్కలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. సోమవారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు నెలలో 12వేల మెట్రిక్ టన్నుల కు గాను 2,500 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ కూటమి రాష్ట్రానికి సరఫరా చేయాల్సిన ఎరువుల్లో కోత విధిస్తే మన పాలకులు ప్రశ్నించడం లేదని ధ్వజమెత్తారు. నదీ జలాలు శివారు భూములకు అందించాలని, జీడికి గిట్టుబాటు ధర కల్పించి జీడి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నంబూరు షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, హనుమంతు ఈశ్వరరావు, బగాది వాసుదేవరావు, బొంతు అప్పారావు, గణేష్ తదితరులున్నారు.



